లక్ష్ ఇంటర్నేషనల్ స్కూల్‌ను ప్రారంభిస్తున్న శశికుమార్, ఎమ్మెల్యే, తదితరులు

అట్టహాసంగా లక్ష్ ఇంటర్నేషనల్ స్కూల్ ఐదో బ్రాంచ్ ప్రారంభోత్సవం

కమాన్‌చౌరస్తా, మే 26 : జిల్లా కేంద్రంలోని రజ్వీ చమన్‌లో లక్ష్ ఇంటర్నేషనల్ స్కూల్ ఐదో బ్రాంచ్ ప్రారంభోత్సవం అట్టహాసంగా జరిగింది. కార్యక్రమానికి సీనియర్ స్పేస్ సైంటిస్ట్ డాక్టర్ టీపీ శశికుమార్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, చొప్పదండి, పెద్దపల్లి ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, విజయ రమణారావు, నగర మేయర్ యాదగిరి సునీల్ రావు, ట్రస్మా రాష్ట్ర గౌరవ సలహాదారు యాదగిరి శేఖర్ రావు హాజరై లక్ష్ విద్యాసంస్థల అధినేత ముస్తాక్ అలీతో కలిసి నూతన బ్రాంచ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విద్యను విద్యార్థులకు చేరువ చేసే ప్రయత్నంలో ప్రయోగాత్మక విద్య అందించాలని సూచించారు. ఇక్కడ సిద్ధార్థ విద్యాసంస్థల అధినేత దాసరి శ్రీపాల్ రెడ్డి, ఐవీవై ఇంటర్నేషనల్ స్కూల్స్ అధినేత పసుల మహేశ్, ట్రస్మా నాయకుడు సురేందర్, పురాణం మహేశ్వర్ శర్మ, ముఫ్తి ఘయాజ్ మోసిన్ మౌలానా ఖాజా కలీముద్దీన్, ముస్లి అలీం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దమ్మికా కాయ్ క్రీడాకారులకు పతకాలు

జాతీయస్థాయి కరాటే పోటీల్లో పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు

కొత్తపల్లి, మే 26 : గోవాలో ఈనెల 25, 26వ తేదీల్లో జరిగిన జాతీయస్థాయి కరాటే పోటీల్లో జిల్లా కేంద్రానికి చెందిన దమ్మికా కాయ్ షిటోరియా కరాటే అకాడమీకి చెందిన పలువురు క్రీడాకారులు పతకాలు సాధించినట్లు చీఫ్ ఆర్ ప్రసన్నకృష్ణ పేర్కొన్నారు. అండర్-14 కుమిటీ విభాగంలో మధు శ్రీ బంగారు పతకం, ఆదిత్య సాయి బంగారు పతకం, శ్రీతిక్‌నందన్ రజత పతకం, 14 సంవత్సరాల పైవిభాగంలో జే శ్రీ చరణ్ బంగారు పతకం, బీ మణితేజ రజత పతకం సాధించి సత్తాచాటారు. వీరిని తెలంగాణ రాష్ట్ర దమ్మికా కాయ్ అధ్యక్ష కార్యదర్శులు ప్రసన్నకృష్ణ, బండారి సంతోష్, కోచ్ ఏ వినోద్ అభినందించారు.

నమ్మించి నట్టేట ముంచారు

- డీసీఎంఎస్ అధికారులు, పాలకవర్గం తీరుపై కాంప్లెక్స్ కిరాయిదారులు
- 'నమస్తే' కథనంతో ఒక్కొక్కరుగా బయటకు వస్తున్న బాధితులు

హుజూరాబాద్, మే 26: డీసీఎంఎస్ అధికారులు, పాలకవర్గం ఒంటెద్దు పోకడలపై ఈ నెల 24న 'నమస్తే తెలంగాణ'లో 'అంతా మా ఇష్టం' శీర్షికన కథనం ప్రచురితమైన విషయం విదితమే. ఈ క్రమంలో డీసీఎంఎస్ బాధితులు ఒక్కొక్కరుగా బయటకు వస్తూ తమకు జరిగిన అన్యాయాన్ని చెప్పుకొంటున్నారు. చాలా మంది ముందుకు వచ్చి తమ ఆవేదనను 'నమస్తే తెలంగాణ'తో పంచుకున్నారు. తమను కూరలో కరివేపాకు లెక్కా వాడుకొని మోసం చేశారని వాపోతున్నారు. ఒకే రకం పొడవు, వెడల్పు పక్కపక్కనే ఉన్న షెట్టర్లకు కిరాయి తేడా ఉన్న విషయంలో అగ్రిమెంట్ జరిగిన సమయంలో పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారినట్లు డీసీఎంఎస్ కాంప్లెక్స్‌లో చర్చ జరుగుతున్నది. దీనిపై అధికారులు విచారణ చేపట్టాలని పలువురు లీజుదారులు కోరుతున్నారు.

హుజూరాబాద్‌లోని డీసీఎంఎస్ కాంప్లెక్స్

డీసీఎమ్మెసోళ్లు మోసం చేసింది వాస్తవమే

'నమస్తే తెలంగాణ'లో డీసీఎంఎస్ అధికారులు, పాలకవర్గంపై ప్రచురితమైన కథనంలో ప్రతి అక్షరం నిజమే. డీసీఎంఎస్ కాంప్లెక్స్ హెచ్ బ్లాకులోని 10వ నంబర్ షెట్టర్‌లో నేను 20యేండ్ల క్రితం డీటీపీ సెంటర్ పెట్టుకున్న. యాదగిరి అనే వ్యక్తి దగ్గర కిరాయికి తీసుకొని నడిపించుకుంటున్న. రెండేండ్ల క్రితం కరీంనగర్ డీసీఎంఎస్ కార్యాలయం నుంచి అర్జంటుగా రమ్మని ఫోను కాల్ వచ్చింది. నేను వెళ్లా. అక్కడ నేను కిరాయికి ఉంటున్న షెట్టర్‌ను నాపేరు మీద చేస్తామని చెప్పారు. నేను తిరస్కరించా. నాకు కిరాయికి ఇచ్చిన వ్యక్తికి అన్యాయం చేయలేనన్నా. నీ ఇష్టం... నువ్వు చేసుకోకపోతే వేరే వాళ్లకు చేయడానికి సిద్ధంగా ఉన్నం. ఇదే జరిగితే నీవు వెంటనే ఖాళీ చేయాలన్నారు. వాళ్లు చెప్పిన దానికి భయపడి నేను కిరాయికి ఉంటున్న షట్టర్‌ను నాకు ఇష్టం లేకున్నా అగ్రిమెంట్ చేయించుకున్న. మళ్లీ ఐదు నెలల తర్వాత డీసీఎంఎస్ ఆఫీసు నుంచి అర్జంటుగా రమ్మని ఫోను కాల్ వచ్చింది. నేను వెళ్లాను. షెట్టర్‌కు సంబంధించి నీ అగ్రిమెంట్ క్యాన్సిల్ చేసుకొంటే పాత ఓనరుకు తిరిగి ఇస్తామని చెప్పారు. గిదేంది సర్ మా పరిస్థితి ఏందని అడిగా. రెండేళ్లలో డీసీఎంఎస్‌లో కొత్త కాంప్లెక్స్ నిర్మించబోతున్నం. అందులో షెట్టర్ ఇస్తామని చెప్పి.. ఒప్పించి నా అగ్రిమెంట్ క్యాన్సిల్ చేసి పాత లీజుదారు యాదగిరి పేరిట మార్చారు. కాంప్లెక్స్ నిర్మాణంపై డీసీఎంఎస్ అధికారులను పదులసార్లు అడిగితే సమాధానం సరిగ్గా ఇవ్వడంలేదు. నా సందాన నేను ఉంటే, డీసీఎమ్మెస్సోళ్లు పిలిచి షెట్టర్ ఓనరుకు నాకు మధ్య విభేదాలు సృష్టించారు. నాలెక్క 22మందికి చేయగా అందులో ఏడుగురు రోడ్డున పడ్డారు. ఆ ఏడుగురిని పాత లీజుదారులు ఖాళీ చేయించారు. నిజంగానే డీసీఎంఎస్ అధికారులు నాకు అగ్రిమెంట్ చేయకపోతే పాతోళ్ల డిపాజిట్ తిరిగి ఇచ్చి, నా దగ్గర తీసుకోవాలి కదా? అదేమీ చేయలేదు. ఇదంతా గమనిస్తే నాలాంటి వాళ్లను ముందట పెట్టి నాటకం ఆడి... మోసం చేసినట్లు తెలుస్తున్నది. 22మంది పరిస్థితి రెంటికి చెడ్డ రేవడిలా తయారైంది. ఇప్పటికైనా డీసీఎంఎస్ అధికారులు మాకు ఇచ్చిన మాట ప్రకారంగా కొత్తగా కాంప్లెక్స్ నిర్మించి షెట్టర్ ఇవ్వకపోతే రోడ్డెక్కుతాం.

-కేశెట్టి విజయ్‌కుమార్ (మాస్టర్ గ్రాఫిక్స్, కిరాయిదారు)

మంచి అడ్డా కోల్పోయా

డీసీఎమ్మెస్సోళ్లు నన్ను ఆగం చేసిండ్రు. వాళ్లు చేయబట్టి మంచిగా దందా నడిచే అడ్డా పోయింది. నేను డీసీఎంఎస్ కాంప్లెక్స్‌లోని ఏ బ్లాకులో బహిరంగ వేలంలో షెట్టర్ పొందిన వ్యక్తి నుంచి 2008లో అద్దెకు తీసుకొని కిరాణాషాపు పెట్టుకొన్న. 2021వరకు సదరు వ్యక్తికి అద్దె చెల్లిస్తున్న క్రమంలో కరీంనగర్ డీసీఎంఎస్ కార్యాలయం నుంచి అర్జంటుగా రమ్మని ఫోను కాల్ రాగా వెళ్లా. నేను కిరాయికి ఉంటున్న షెట్టర్‌ను నాపేరు మీద చేస్తామని అధికారులు చెప్పగా తిరస్కరించా. నువ్వు వద్దంటే వేరే వాళ్లకు చేస్తే వెంటనే షెట్టర్ ఖాళీ చేయాల్సి ఉంటుందని భయపెట్టారు. వాళ్ల మాటలకు భయపడి నేను కిరాయికి ఉంటున్న షెట్టర్‌ను నాకు ఇష్టం లేకున్నా అగ్రిమెంట్ చేయించుకున్న. అప్పటి నుంచి నాకు లొల్లి మొదలైంది. నాకు తెలియకుండా అగ్రిమెంట్ ఎందుకు చేసుకున్నావని బహిరంగ వేలంలో షెట్టర్ పొందిన వ్యక్తి షాపు ముందర లొల్లి పెట్టడం షురూ చేశాడు. ఈ విషయాన్ని డీసీఎంఎస్ వాళ్లకు చెబితే మేం ఉన్నామని కల్లబొల్లి కబుర్లు చెప్పారు. నాలాంటోళ్లకు రెండేళ్లు అగ్రిమెంట్ చేస్తే నాకు మాత్రం యేడాది మాత్రమే చేశారు. యేడాది తర్వాత తిరిగి పాత లీజుదారుకు అగ్రిమెంట్ చేశారు. ఇదేందని అడిగితే కొత్తగా కాంప్లెక్స్ నిర్మాణం చేపడుతున్నామని, అందులో ఇస్తామని నమ్మబలికి ఓ కాగితం రాసిచ్చారు. ఇప్పుడు కొత్తగా కాంప్లెక్స్ నిర్మాణం విషయంపై డీసీఎంఎస్ అధికారులను అడిగితే దాట వేస్తున్నారు. వాళ్లు చేసిన మూర్ఖపు పనితో మంచి అడ్డా కోల్పోయా. డీసీఎమ్మెస్సోళ్లు మమ్మల్ని వాడుకొని వదిలివేశారు. వాళ్లు మాకు ఇచ్చిన మాట నిలుపుకోవాలి.

-చందా ప్రభాకర్ (డీసీఎంఎస్ బాధితుడు)

బీఆర్ఎస్ నాయకుడి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

నరేందర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కార్పొరేషన్, మే 26: కరీంనగర్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకుడు మిర్యాల్కర్ నరేందర్ ఇటీవల గుండెపోటుతో మృతిచెందగా, ఆదివారం ఆయన కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పరామర్శించారు. నరేందర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కమలాకర్ మిత్రుడు ఎస్ఎంఎస్ శ్రీనివాస్ తల్లి రత్నాబాయి ఇటీవల మృతి చెందగా, వారి కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు. ఆయన వెంట నగర మేయర్ యాదగిరి సునీల్ రావు, కార్పొరేటర్ తోట రాములు, నాయకులు కోల సంపత్‌రెడ్డి, అనురాస్ కుమార్, బొల్లం లింగమూర్తి, శ్రీనివాస్, మధు తదితరులున్నారు.

తాడికల్ ప్రమాదంలో మరొకరు మృతి

కనకమ్మ (ఫైల్)

శంకరపట్నం, మే 26: తాడికల్ గ్రామంలో ట్యాంకర్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వెంగల కనకమ్మ చికిత్స పొందుతూ మృతి చెందింది. వివరాలు.. ఈ నెల 15న తాడికల్ గ్రామంలో జాతీయ రహదారి 563 నిర్మాణ సంస్థకు చెందిన డీజిల్ ట్యాంకర్ బోల్తా పడిన విషయం విదితమే. డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా జరిగిన ఈ ప్రమాదంలో గ్రామానికి చెందిన పూదరి శ్రీనివాస్ మృతి చెందగా, తాడికల్, చింతగుట్ట గ్రామాలకు చెందిన మరో ఏడుగురు గాయపడ్డారు. వీరిలో తాడికల్ గ్రామానికి చెందిన వెంగల కనకమ్మ (65) తీవ్రంగా గాయపడింది. ఆమెను కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానలో చేర్పించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. కనకమ్మ అవివాహితురాలు. తన రెండెకరాల పొలంలో వ్యవసాయం చేస్తూ జీవించేది. గ్రామంలో పంచాయితీల్లో నిజాయితీగా వ్యవహరించేదని పేరుంది. కాగా, కనకమ్మ ఆస్తి పంపకాల విషయంలో దూరపు బంధువుల మధ్య వివాదం తలెత్తింది. దీంతో అంత్యక్రియలు నిలిపివేసి గొడవకు దిగడంతో గ్రామస్తులు విస్తుపోయారు.

ఖాదీ వస్త్రాల కొనుగోలుపై 40 శాతం ప్రత్యేక తగ్గింపు

హౌసింగ్‌బోర్డుకాలనీ, మే 26: రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా కరీంనగర్‌లోని కమాన్ నుంచి రూరల్ పోలీస్ స్టేషన్ రోడ్డులో గల మెట్‌పల్లి ఖాదీ భవన్‌లో వచ్చే నెల 8 వరకు ఖాదీ వస్త్రాలు 40శాతం ప్రత్యేక తగ్గింపు ధరకు లభిస్తాయని సంస్థ చైర్మన్ కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, ఖాదీ భవన్ మేనేజర్ వీ భిక్షపతి ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ప్రతి ఒక్కరూ ఖాదీ వస్త్రాలు కొనుగోలు చేసి, నేత కార్మికులకు ఉపాధి కల్పిస్తున్న ఖాదీ గ్రామీణ పరిశ్రమలను ప్రోత్సహించాలని కోరారు.

డాక్టర్ నలిమెలకు జీవన సాఫల్య పురస్కారం

కమాన్‌చౌరస్తా, మే 26: జిల్లా కేంద్రానికి చెందిన బహుభాషావేత్త, కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ నలిమెల భాస్కర్ తెలుగు భాషా సాహిత్యంలో చేసిన విశేష పరిశోధనకు గానూ మహ మహోపాధ్యాయ ఆచార్య రవ్వా శ్రీహరి జీవన సాఫల్య పురస్కారం అందుకున్నారు. ఆచార్య రవ్వా శ్రీహరి సంస్కృతాంధ్ర పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో పురస్కారం కింద నలిమెల భాస్కర్‌కు రూ. 50 వేల నగదు, ప్రత్యేక జ్ఞాపికను అందించి సత్కరించారు.

సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షించుకోవాలి

తెలంగాణచౌక్, మే 26: మన దేశ సంస్కృతీసంప్రదాయాలను పరిరక్షించుకోవాలని కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ మారోజు స్వర్ణలత పిలుపునిచ్చారు. నగరంలోని ఎస్‌బీఎస్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం విశ్వబ్రాహ్మణ అఫీషియల్స్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్(వోపా) ఆధ్వర్యంలో నిర్వహించిన విశ్వబ్రాహ్మణ వధూవరుల పరిచయ వేదిక కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సనాతన ధర్మం గొప్పతనాన్ని వివరించారు. కార్యక్రమంలో వోపా గౌరవాధ్యక్షుడు వేములవాడ ద్రోణాచారి, జిల్లా అధ్యక్షుడు కట్ట విష్ణువర్ధన్, ప్రధాన కార్యదర్శి గజ్జెల హరిహరాచారి, ఉపాధ్యక్షుడు గద్దె సత్యనారాయణ, కోశాధికారి అంజయ్య, సంయుక్త కార్యదర్శి బండ్ల శివప్రసాద్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు సకాలంలో పూర్తి చేయాలి

కలెక్టరేట్, మే 26 : వరి ధాన్యం కొనుగోళ్లను సత్వరమే పూర్తి చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వర్ధిరెడ్డి వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. రోహిణీ కార్తె ప్రవేశించడంతో వర్ష ప్రభావం ఉండే అవకాశాలుంటాయని, అకాల వర్షాలతో రైతులకు ఇప్పటికే తీవ్ర పంట నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం నగరంలోని జ్యోతినగర్‌లో గల ఆ సంఘ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో జిల్లా ప్రతినిధులు రాపాక ఆంజనేయులు, మిడిదొడ్డి రాములు, మేరుగు రవీందర్, తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు, తాండ్రియాల రఘుపతి, కంకణాల రాంగోపాల్‌రెడ్డి, రవీందర్‌రావు, జగ్గారావు, తదితరులు పాల్గొన్నారు.

చెస్ పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం

తెలంగాణచౌక్, మే 26: శ్రీసత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో జిల్లా చెస్ అకాడమీ సహకారంతో ఆదివారం శ్రీసత్యసాయిబాబా ఆలయంలో విద్యార్థులకు చెస్ పోటీలను నిర్వహించారు. ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కొనసాగిన పోటీల్లో సుమారు 60 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు శ్రీసత్యసాయి సేవా సంస్థల ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పీ లింగమూర్తి బహుమతులు, ప్రశంసా పత్రాలను ప్రదానం చేశారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి యువకుడి మృతి

రాంనగర్, మే 26 : కొత్తపల్లి మండలం శ్రీరాములపల్లి స్టేజీ వద్ద వేగంగా వెళ్తున్న ద్విచక్ర వాహనం అదుపుతప్పి కల్వర్టును ఢీకొన్న ప్రమాదంలో వాహనదారుడు దుర్మరణం చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం అనంతారం గ్రామానికి చెందిన జక్కుల రాజశేఖర్ కరీంనగర్‌లో ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో పనిచేస్తున్నాడు. ఆదివారం సాయంత్రం 5గంటలకు విధులను ముగించుకొని బైక్‌పై స్వగ్రామానికి తిరిగి వెళ్తున్న క్రమంలో శ్రీరాములపల్లి స్టేజీ వద్దకు రాగానే వాహనం అదుపు తప్పి కల్వర్టు గోడను బలంగా ఢీకొనడంతో రాజశేఖర్ అక్కడికక్కడే మృతి చెందాడు. అతడికి ఇటీవలే వివాహం జరిగినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కొత్తపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

శిఖం భూమి కబ్జాకు యత్నం?

- స్థానికులు ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

జమ్మికుంట, మే 26: మున్సిపల్ పరిధిలోని ఓ వార్డుకు సమీపంలోని చెరువు శిఖం భూమి కబ్జాకు పలువురు యత్నిస్తున్నారని స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోని వైనం స్థానికంగా సర్వత్రా చర్చనీయాంశమైంది. శిఖం భూమిని పక్కనే ఉన్న పట్టాదారు, మరికొందరి సహాయంతో కబ్జా చేసేందుకు పూనుకున్నారు. ఈ క్రమంలో తన భూమిని చదును చేసే నెపంతో పక్కనే ఉన్న శిఖం భూమిని కూడా చదును చేయడం మొదలు పెట్టారు. అంతేకాకుండా చదును చేసిన సొంత భూమితో పాటు శిఖంలో కూడా వాహనాలతో మట్టిని పోయించారు. లెవల్ చేయించారు. దీన్ని గమనించిన స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, తదితరులు అధికారులకు ఫిర్యాదులు చేశామని తెలిపారు. సదరు అధికారులెవరూ స్పందించలేదని స్థానికులు వాపోతున్నారు. పట్టపగలే శిఖం భూమి కబ్జా చేయడాన్ని జీర్ణించుకోలేక పోతున్నారు. శిఖం కబ్జా వెనుక రియల్టర్లు, కొందరు పలుకుబడి నాయకులున్నారని, అధికారులను, సిబ్బందిని మేనేజ్ చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఏదేమైనా శిఖం భూమిని కాపాడాల్సి బాధ్యత సంబంధిత శాఖాధికారులపై ఉంది. విలువైన భూమిని కబ్జా కోరల నుంచి కాపాడాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

'ఎన్ఎంఎంఎస్'లో విద్యార్థుల సత్తా

జమ్మికుంట, మే 26: ఇటీవల విడుదలైన జాతీయ ప్రతిభాన్వేషణ పరీక్షా(నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్) ఫలితాల్లో జమ్మికుంట విద్యార్థులు సత్తా చాటారు. మండలంలోని తనుగుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు గురుకుంట్ల అక్షయ్, కాసర్ల సాయి మహేందర్, జైద అరుణ్, వాసాల పుష్ప ప్రభుత్వం అందించే ఉపకార వేతనాలకు అర్హత సాధించారు. సదరు విద్యార్థులు ఒక్కొక్కరికి నాలుగేళ్ల పాటు ఒక్కో సంవత్సరానికి రూ.12వేల చొప్పున స్కాలర్‌షిప్ బ్యాంకు ద్వారా అందనున్నది. కాగా, ఎన్ఎంఎంఎస్‌కు అర్హత సాధించిన విద్యార్థులను ప్రధానోపాధ్యాయిని స్వర్ణమయి, ఉపాధ్యాయులు రాజయ్య, రాజు, శ్రీలత, పుష్పలీల, భాస్కర్‌రెడ్డి, నజీమా, అశోక్ తదితరులు అభినందించారు.

ఏషియన్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్ పోటీల్లో ప్రతిభ

సిరిచందనను అభినందిస్తున్న డీవైఎస్‌వో

కొత్తపల్లి, మే 26 : ఈ నెల 6 నుంచి 11 వరకు హాంకాంగ్‌లో జరిగిన ఏషియన్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఇండియా తరపున పాల్గొన్న కరీంనగర్‌కు చెందిన క్రీడాకారిణి తుడి సిరిచందన మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించింది. 52 కేజీల విభాగంలో పోటీపడ్డ సిరిచందన అద్భుత ప్రతిభ చూపి మొదటి స్థానంలో నిలిచింది. ఆమెను జిల్లా యువజన, క్రీడాశాఖాధికారి శ్రీకాంత్‌రెడ్డి అభినందించి అంతర్జాతీయ పోటీల్లో సత్తాచాటాలని సూచించారు. పవర్ లిఫ్టింగ్ శిక్షణలకు అవసరమైన క్రీడా సామగ్రిని అందించేందుకు కృషిచేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కోచ్ మల్లేశ్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ
CLASSIFIED
LOST
★Thipparam Rajashekar, S/o. Chandrachari, H.No. 8-2-114, Gandhnagar Sircilla Town & Mandal Rajanna Sircilla Dist. My Pass Port No. L8218922 Lost going by Bike from House to Bus Stand any One Find call Me: 9553159151
NTK-00000

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

మహారాణా ప్రతాప్ జయంతి

తెలంగాణచౌక్, మే 26: రాజ్‌పుత్ సమాజ్ ఆధ్వర్యంలో వీర శిరోమణి మహారాణా ప్రతాప్ 454 జయంతి వేడుకలను ప్రెస్ భవనంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర రాజ్‌పుత్ సంఘం నాయకులు విజయ్‌సింగ్, ఠాకూర్ సతీశ్‌సింగ్ దేశం కోసం మహారాణా ప్రతాప్ చేసిన సేవలను కొనియాడారు. అనంతరం జిల్లా రాజ్‌పుత్ సమాజ్ ఆధ్వర్యంలో రాష్ట్ర రాజ్‌పుత్ సంఘం నాయకులను ఘనంగా సన్మానించారు. రాజ్‌పుత్ సమాజ్ ఉమ్మడి జిల్లా నాయకులు రఘువీర్‌సింగ్, జయప్రకాశ్ సింగ్, సంతోష్ సింగ్ పాల్గొన్నారు.

'ప్రణవ్‌ను విమర్శించే స్థాయి సమ్మిరెడ్డికి లేదు'

హుజూరాబాద్ రూరల్, మే 26: నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్‌ను విమర్శించే స్థాయి తుమ్మేటి సమ్మిరెడ్డికి లేదని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిప్పారపు సంపత్ ఎద్దేవా చేశారు. ఆదివారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, జమ్మికుంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సమ్మిరెడ్డి తన అనుచరులతో కలిసి ప్రణవ్‌ను విమర్శించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రణవ్‌పై అసత్య ప్రచారాలు చేసినా, పార్టీకి ఇబ్బందులు తలెత్తేలా వ్యవహరించినా చూస్తూ ఊరుకోబోమని సంపత్ హెచ్చరించారు.

బీపీ, షుగర్ అదుపులో ఉంటేనే ఆరోగ్యం

- హెల్త్ టాక్‌లో మెడికవర్ వైద్యుల సూచన

మాట్లాడుతున్న మెడికవర్ హాస్పిటల్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్

విద్యానగర్, మే 26: ప్రాణాంతక వ్యాధులన్నింటికీ మూల కారణాలు బీపీ, షుగర్ అని, వాటిని అదుపులో ఉంచుకుంటే ఆరోగ్యంగా జీవించవచ్చని మెడికవర్ వైద్యులు సూచించారు. వరల్డ్ ఎమర్జెన్సీ డేను పురస్కరించుకొని కరీంనగర్ మెడికల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం విద్యానగర్‌లోని పాలిటెక్నిక్ మైదానంలో ఏర్పాటు చేసిన హెల్త్ టాక్, ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 300 మంది వాకర్స్‌కు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ, మెరుగైన జీవితం కోసం ప్రతి ఒక్కరూ కలలు కంటారని, వాటిని నిజం చేసుకోవాలంటే ఆహారం, ఇతర అలవాట్లపై నియంత్రణ తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. ప్రస్తుత రోజుల్లో 23 సంవత్సరాలకు హార్ట్ స్ట్రోక్ వచ్చిన పేషెంట్లను కూడా చూస్తున్నామని, ఈ పరిస్థితి రాకుండా ఉండాలంటే మద్యం, స్మోకింగ్ వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండడంతో పాటు వ్యాయామం చేయాల్సిన అవసరం ఉందన్నారు. 17వ డివిజన్ కార్పొరేటర్ కోల భాగ్యలక్ష్మీప్రశాంత్ మాట్లాడుతూ, ప్రజల దగ్గరికే వచ్చి ఉచిత వైద్యం అందిస్తున్న మెడికల్ హాస్పిటల్ యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. పేదల కోసం మరిన్ని ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని కోరారు. మెడికవర్ హాస్పిటల్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో హాస్పిటల్ ఎమర్జెన్సీ ఫిజిషియన్లు డాక్టర్ వేముల సత్యనారాయణ, డాక్టర్ విద్యా ప్రకాశ్, డాక్టర్ రుత్విక్, డాక్టర్ దీక్షిత్, క్రిటికల్ కేర్ హెచ్‌వోడీ డాక్టర్ ఉపేందర్ రెడ్డి, న్యూరో సర్జన్ డాక్టర్ వెంకటేశ్, యూరాలజిస్ట్ డాక్టర్ రవిశంకర్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రవి మల్లారెడ్డి, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు హనుమాండ్ల రఘుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హోటళ్లలో తనిఖీలు

విద్యానగర్, మే 26: కరీంనగర్‌లోని పలు హోటళ్లలో ఆదివారం వరంగల్ అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ అమృతశ్రీ నేతృత్వంలో స్పెషల్ టాస్క్‌ఫోర్స్, ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు చేపట్టారు. హోటళ్లలో ఆహార పదార్థాల తయారీలో గడువు ముగిసిన పదార్థాలను వాడుతుండడాన్ని గుర్తించినట్లు అధికారులు తెలిపారు. వీటిపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని చెప్పారు. ఉదయం చేపట్టిన తనిఖీలు రాత్రి వరకు కొనసాగుతున్నాయి. తనిఖీల్లో సేఫ్టీ ఆఫీసర్ టీ నాయక్, కరీంనగర్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ సునీత, సిబ్బంది పాల్గొన్నారు.

ఏసీపీకి బీజేపీ నేతల ఫిర్యాదు

విద్యానగర్, మే 26: హనుమాన్ దీక్షాపరుల శోభాయాత్ర సందర్భంగా శనివారం రాత్రి చోటు చేసుకున్న ఘటనలో బీజేపీని బద్నాం చేయడానికి కొన్ని ఫేక్ మీడియా సంస్థలు, సోషల్ మీడియా గ్రూపులు ప్రయత్నిస్తున్నాయని, వాటిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు ఆదివారం ఏసీపీకి ఫిర్యాదు చేశారు. ఇక్కడ బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు భాస సత్యనారాయణ రావు, పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు, ఉప్పరపల్లి శ్రీనివాస్, నాగసముద్రం ప్రవీణ్, ఎన్నం ప్రకాశ్, రవి తదితరులు ఉన్నారు.

ఎక్స్‌యూవీ వాహన విక్రయాలను ప్రారంభించిన ఎమ్మెల్యే

విద్యానగర్, మే 26: కరీంనగర్ మహీంద్ర షోరూంలో నూతనంగా లాంచ్ చేసిన ఎక్స్‌యూవీ వాహనాల విక్రయాలను ఆదివారం ఎమ్మెల్యే గంగుల కమలాకర్, నగర మేయర్ యాదగిరి సునీల్ రావు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. కొనుగోలుదారులకు వాహనాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మహీంద్రా వాహనం అంటే రక్షణ కవచం లాంటిందని పేర్కొన్నారు. షోరూం నిర్వాహకులు మాట్లాడుతూ, మహీంద్రా నుంచి అనేక కొత్త మోడల్ కార్లు వస్తున్నాయని, వాటిలో రక్షణకు సంబంధించిన ఫీచర్స్‌కు ప్రాముఖ్యతను ఇస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే మహీంద్రా థార్, స్కార్పియో ఎన్, క్లాసిక్, ఎక్స్‌యూవీ 700, 300, బొలెరో, నియో లాంటి మోడల్స్ ప్రజాదరణ పొందాయన్నారు. ఇప్పుడు సరికొత్త అధ్యాయాన్ని సృష్టిస్తూ, మహీంద్రా ఎక్స్‌యూవీ 3 ఎక్స్‌వో మార్కెట్‌లోకి విడుదలైందని పేర్కొన్నారు. ఆదివారం 23 కార్లు డెలివరీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జంగిలి ఐలేందర్ యాదవ్, షోరూం సేల్స్ జనరల్ మేనేజర్ కేకే రెడ్డి, సర్వీస్ జనరల్ మేనేజర్ శివ, సేల్స్ మేనేజర్ జర్నల్ సింగ్, సీనియర్ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ దీటి విక్రమ్, ప్రశాంత్‌కుమార్, రాజేశ్ కన్నా, సిబ్బంది పాల్గొన్నారు.

కొనుగోలుదారుకు వాహనం కీని అందజేస్తున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్, పక్కన మేయర్ సునీల్‌రావు తదితరులు

మానకొండూర్ రూరల్: ఊటూర్ పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనంలో 1983-84 ఎస్సెస్సీ విద్యార్థులు

శంకరపట్నం: తాడికల్ హైస్కూల్‌లో ఆత్మీయ సమ్మేళనంలో 1995-96 ఎస్సెస్సీ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాలు

మానకొండూర్ రూరల్/ శంకరపట్నం/ హుజూరాబాద్ రూరల్, మే 26: మానకొండూర్ మండలం ఊటూర్ పాఠశాల ఆవరణలో 1983-84 పదో తరగతి బ్యాచ్, శంకరపట్నం మండలం తాడికల్ హైస్కూల్‌లో 1995-96 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. అనంతరం విద్యా బుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. అలాగే హుజూరాబాద్ మండలం కనుకులగిద్ద గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో 1986-87 సంవత్సరంలో 7వ తరగతి చదివిన విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం జరుపుకొన్నారు.

హనుమాన్ రథయాత్ర వివాదంలో ఇరు వర్గాలపై కేసు

- ఎనిమిది మంది రిమాండ్
- త్రీ టౌన్ ఇన్‌స్పెక్టర్ జాన్‌రెడ్డి వెల్లడి

రాంనగర్, మే 26 : కరీంనగర్‌లో శనివారం జరిగిన హనుమాన్ రథయాత్ర వివాదంలో ఇరువర్గాలపై కేసులు నమోదయ్యాయి. ఈ ఘటనలో ఎనిమిది మందిని రిమాండ్ చేసినట్లు త్రీ టౌన్ ఇన్‌స్పెక్టర్ జాన్‌రెడ్డి తెలిపారు. పూర్తి వివరాలిలా ఉన్నాయి. కరీంనగర్‌లోని వావిలాలపల్లికి చెందిన చిట్ల శ్రీనివాస్ ప్రభుత్వ దవాఖాన ఎదుట గల ప్రసన్నాంజనేయ గుడి నుంచి రథయాత్రకు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి నుంచి అనుమతి తీసుకున్నాడు. శనివారం సాయంత్రం రథయాత్రను ప్రారంభించి స్థానిక మంచిర్యాల చౌరస్తా వద్ద గల సవేరా కేఫ్ వద్దకు చేరుకోగా, చవారియా జయదేవ్ సింగ్ అనే వ్యక్తి వచ్చి హనుమాన్ మాలధారుల పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. అంతే కాకుండా తన వెంట తెచ్చుకున్న కత్తిని వారికి చూపిస్తూ బెదిరింపులకు గురిచేశాడు. దీంతో శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ జరిపిన పోలీసులు నిందితుడిని గుర్తించి చావరియా జయదేవ్‌సింగ్‌పై కేసు నమోదు చేశారు. ఈ మేరకు కోర్టులో హాజరు పర్చగా, అతడికి రిమాండ్ విధించింది. మరోవైపు చవారియా జయదేవ్ సింగ్ సైతం యాత్రలో తాను జై శ్రీరామ్ , జై హనుమాన్ అని నినాదాలు చేశానని, ఇంతలో అక్కడే మాల ధారణలో ఉన్న భక్తులు గుంపుగా ఏర్పడి పిడిగుద్దులు కురిపించారని త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తనను పోలీసుస్టేషన్ తరలించే క్రమంలో వాహనాన్ని వెంబడించి అడ్డుకుని వాహనం నుంచి లాగి రోడ్డుపై పడేసి విచక్షణా రహితంగా దాడి చేశారని పేర్కొన్నారు. ఈ మేరకు విచారణ జరిపిన త్రీటౌన్ ఇన్‌స్పెక్టర్ నిందితులను గుర్తించి చీకట్ల శ్రీనివాస్, బేడిగ జగన్, నూర నరేశ్, నూకల ఐలోని, కౌడ నిఖిల్, కాసు సాయి కిరణ్, కరిగొప్పుల అజయ్‌పై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు. కోర్టులో హాజరు పర్చగా రిమాండ్ విధించారు.